# ★ ఆహుతి ★

నంద్యాల కొండమాచార్య

వరిమొక్కలు నాటుతూ అనుకున్నాడు రంగస్వామి. "ఈనాటి వరిమొక్కలు పెరిగి పెద్దవై కంకుల భారంతో వంకరలుతిరిగి పూర్ణస్థితిని పొందాలంటే సరియైన వర్షం అవసరం. అలాగే సీతమ్మ జీవితం ఆనందమయం కావాలంటే, సంసారసాగరమథనంలో ఉద్భవించే అమృతాన్ని ఆస్వాదించాలంటే ఆమెను మంచివాడికిచ్చి పెండ్లి చెయ్యాలి!" అని.

కాలం గడుస్తూంది. కాలంతోపాటు వరిమొక్కలుగూడా గుబ్బలు గట్టి యౌవనాన్ని దాలుస్తున్నవి. గట్టుమీద కూర్చొని ఆలోచిస్తున్నాడు రంగస్వామి. "ఈవరిమొక్కలు మోస్తారే సీతమ్మగూడా యౌవనవతి అయింది. ఆమె జీవితం పండాలంటే..." పెరుగు పోయిన నిరాశలమీద గూడుకట్టుకుంటున్న ఆశలను బలపరుచుకోటానికి పొట్ట మీద వున్న ఎకరం వరిపొలం కళ్ళి తేరి పారచూచాడు రంగస్వామి. వరిమొక్కలు పిల్ల గాలికి తలలూపుతున్నవి. "మేము నీకోర్కె తీరుస్తాములే" అన్నట్లు.

ఆడపిల్లలను కన్న తలిదండ్రులకు కట్నపిశాచంతో యుద్ధం తప్పటం లేదు. తల్లిపోయిన దగ్గరనుంచి ఎంతో ప్రేమతో పెంచాడు సీతమ్మని రంగస్వామి. చీకటితెరలు అల్లుకుపోయిన ఆ పూరింటిలో సీతమ్మను చూచుకుంటూ కాలం గడుపుతున్నాడు. కాని అతని తీరని కోరిక ఒక్కటే. సీతమ్మ పెద్దమనిషి అయ్యి యిప్పటి కప్పుడే రెండేళ్ళు కావస్తున్నది. వివాహ విషయంలో ఎంతో ప్రయత్నించాడు ఈరెండేళ్ళ బట్టీని కాని ఏంలాభం. ఈకార్యంలో ప్రతీతడవా రంగస్వామిని కట్నపిశాచం ఓడించింది. ఏ సంబంధం విచారించినా వేలాది కట్నం కోరేవారే. ఒక్క ఎకరం పొలంవున్న రంగస్వామి పొట్టగడవటానికే ఇబ్బంది పడేరంగస్వామి ఏమిస్తాడు వరకట్నం; ..మరిఎలా .. కనీసం ఈయేడైనా సీతమ్మ వివాహం చెయ్యాలి. ఇంకా ఆపితే సంఘం నోటిలో నానవలసి వస్తుంది. ... అదే ఆలోచిస్తున్నాడు రంగస్వామి. ఈయేడు వరి కాస్తా బాగా పండితే ఏదో తన శక్త్యానుసారం కట్నం చెల్లిస్తాడు. కాకపోతే బతిమాలాడుకుంటాడు.

అయితే ఈమధ్య ఇంకో కథ జరిగింది. ఆగ్రామంలోనే నాగయ్య అనే ఆయనవున్నాడు. అతనికి రెండు వివాహాలయ్యాయి. ఇద్దరు భార్యలు గతించారు. అతని వయస్సు రెండుమూడేండ్లలో షష్టిపూర్తి అవుతుంది. అతను రంగస్వామి బీదరికాన్ని ఆధారంగా తీసికొని సీతమ్మని తనకివ్వమని అడిగాడు. "ఇదిగో చూడు! ఈరోజుల్లో కట్నాలు ఇవ్వంది నీపిల్లను ఎవ్వరూ చేసుకోరు, కట్న కానుకలు లేకుండా నేను చేసుకుంటాను. నాకా సంతానం లేదు, కావలసినంత సొమ్ము పెడతాను పైగా నీచేతికొక అయిదారు వందలు గూడా యిస్తాను. ..."ఏం... అన్నాడు నాగయ్య.

రంగసామి ససేమిరా అన్నాడు ఆపిల్ల గొంతు కోయ్యటం తనకిష్టంలేదన్నాడు. సీతమ్మ జీవితం స్వార్థానికి బలిచేసి ఆమెనొక వృద్ధుడికిచ్చి అంటగట్టలేనన్నాడు. నవయువ్వనంతో పొంగిపోయే సీతమ్మను యౌవ్వనం కరిగి పోయిన నాగయ్యకియ్యటం ఆమెను చేతులారా పాడుచేయటమే అని తలపోశాడు రంగస్వామి సంఘంలో నానాటికి పెరిగిపోతూన్న అవినీతికి ఇటువంటి వృద్ధ వివాహాలు కారణమని రంగస్వామికి తెలుసు.

కాలం గడుస్తూంది. వరి కోతలు కోసి కుప్పలు వేశారు. ఈలోగా మరల జోగయ్య రంగస్వామిని రెండుమూడు తడవలు హెచ్చరించాడు.

"నాకన్నా ఆస్తి వున్నవాళ్లు నీకెక్కడా దొరుకరు. నీవంగీకరిస్తే ఈ మాఘమాసంలో ముహూర్తం పెట్టిస్తాను" అన్నాడు జోగయ్య.

రంగస్వామికి కోపంవచ్చింది. "నీ ఆస్తి ఎవడిక్కావాలి! ఏది యేమయినా నీలాంటి వృద్ధుడికి నా కూతురునిచ్చి పాపం మూటగట్టుకోను. వరికుప్ప నూర్పింతరువాత...గింజలు అమ్మి ...దాని వివాహం బీదవాడయినా, కుర్రవాడికిచ్చి చేస్తాను." అన్నాడు రంగస్వామి కఠినంగా.

"సరే ఈ పందెంలో నీవు గెలుస్తావో నేను గెలుస్తానో చూస్తావుగా" అన్నట్లు జోగయ్య తల పంకించి చక్కాపోయాడు. రోజులు గడిచిపోతున్నవి.

తెల్లవారేసరికల్లా గోలపుట్టింది. రంగస్వామి చేనులో వరికుప్ప ఎవరో తగలపెట్టారని రంగస్వామి నెత్తి బాదుకుంటూ తగలబడిన వరికుప్ప బూడిదవద్ద కూర్చొని విలపించాడు. అతని కోరికలు, ఊహలు కారిపోయే కన్నీటిద్వారా బూడిదలో పడి ఇంకిపోయాయి. అతని విలాపం విశాల విశ్వపు అంచుల్లో అంతరించిపోయింది. మొత్తానికి వరికుప్ప తగలబెట్టింది కమ్యూనిస్టులేనని తేల్చారు ఊళ్ళోవాళ్ళంతా. పేపర్లల్లో కూడా పడ్డది. 'ఫలాని గ్రామంపై కమ్యూనిస్టులు దాడిచేశారనీ రంగస్వామి వరికుప్ప తగలబెట్టారనీ'. ఏది ఎలాగైనా రంగస్వామి ఆశాసౌధాలు అట్టడుగుకు కూలిపోయాయ్.

ఏమీ ఎరగనట్లు గప్ చిప్ గా తనలో తను నవ్వుకున్నాడు జోగయ్య ఇక నేను గెలిచానులే అన్నట్లు. అసలు రహస్యం ఎవరికి తెలుసు. మానవుడు తన లక్ష్యం సాధించుకోటంకోసం రాక్షసప్రకృతినికూడా అవలంబిస్తాడని జోగయ్య రుజువుచేశాడు.

రంగస్వామి పరిస్థితి దుర్భరంగా మారింది. తిండికిగూడా ఇబ్బందిగాయుంది. సీతమ్మకు వివాహంచేసి ఆమెను సుఖపెట్టాల్సని చూచిన రంగస్వామి కూతురుకు తిండిగూడా పెట్టలేకపోతున్నాడు. తండ్రి తనకోసం పడే కష్టాన్ని చూచి సీతమ్మ ఎంతో విచారించింది. ఈ అదును చూచి జోగయ్య రంగస్వామి పరిస్థితికి చాలా విచారించినట్లు కనుపించాడు. రంగస్వామిని "ఎవరో దుష్టులు అలా చేసివుంటారు! ఇంతకూ కర్మ లే" అంటూ జోగయ్య ఓదార్చాడు. ఆ పరిస్థితిలో జోగయ్య సాయాన్ని రంగస్వామి వద్దనలేకపోయాడు. రంగస్వామి తిండికి పాతిక పరకా అందుకున్నాడు జోగయ్య.

రంగస్వామి కోరిక అనే చెట్టు జోగయ్య పశుప్రకృతి అనే తుఫానుకు విరిగిపడిపోయింది...ఇక చెప్పేదేముంది. ఆ మాఘమాసంలో సీతమ్మ వివాహం జోగయ్యతో విధిలేనట్లు జరిగిపోయింది. సీతమ్మ ఇప్పుడు జోగయ్య భార్య అన్నమాట. రంగస్వామి పట్టుదల ఏమయింది? మొత్తానికి పందెంలో జోగయ్య గెలిచాడు.

★

ఆనందవాణి

పోస్టుబాక్సు నెంబరు

1583

—మేనేజరు